సాక్షి ఆదిలాబాద్


మంగళవారం | 5 | ఆగస్టు | 2025



ఆర్జీయూకేటీలో యక్షగానం

బాసరలోని ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో సోమవారం స్పీక్ మాకే హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో యక్షగాన కళా ప్రదర్శన నిర్వహించారు. సీతాపహరణ ఘట్టం ఆకట్టుకుంది. 8లో▸

గ్రామాల్లో దొంగల భయం



తాంసి మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఆయా గ్రామాల్లోని ఇళ్లలో డబ్బు, ఆభరణాలతో పాటు బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో జనం బెంబేలెత్తుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

'మధ్యాహ్న' కార్మికుల సమ్మె



నినాదాలు చేస్తున్న 'మధ్యాహ్న' కార్మికులు

కైలాస్‌నగర్: పెండింగ్ వేతనాలు,బిల్లులు విడుదల చేయాలనే డిమాండ్‌తో ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. సోమవారం విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు మాట్లాడుతూ.. ఏడాదిగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బి ల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వేతనాలు కూడా ఆరు నెలలుగా అందడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో వంట చేయడం ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఇందులో సంఘ నాయకులు శ్రీదేవి, రాంబాయి, పు ష్పలత, సంతోష్, నాందేవ్, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

కైలాస్‌నగర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో టాస్క్ సౌజన్యంతో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి కె.మిల్కా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద జాబ్‌మేళాకు సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్న మేళాకు ప్రముఖ ఐటీ, నాన్ ఐటీ వంటి 20 కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు.టెన్త్ నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోధ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సీడీపీవోగా ఫర్హా

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ అర్బన్ ఇన్‌చార్జి సీడీపీవోగా సూపర్‌వైజర్ ఫర్హాకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా సంక్షేమ అధికారి మిల్కా ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు పనిచేసిన సీడీపీవో వనజ ఉద్యోగ విరమణ పొందడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. దీంతో ఆమెకు బాధ్యతలు అప్పగించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలపై బాధ్యతాయుతంగా వ్యవహరించి త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీ వెన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి 38 మంది హాజరై దరఖాస్తులు అందజేశారు. వారి సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్‌లో రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్న కలెక్టర్ రాజర్షి షాను జిల్లా అధికారులు సోమవారం ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమష్టి కృషితోనే అవార్డు సాధించగలిగామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ సీవీఎస్.రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

కైలాస్‌నగర్: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, వాటి ప్రాముఖ్యతపై మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తల్లిపాల వారోత్సవాలు, పోషకాహార దినోత్సవ అవగాహన ప్రచార పోస్టర్లను కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో కలిసి సోమవారం విడుదల చేశారు. ఈనెల 7వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లి పాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా సంక్షేమాధికారి మిల్కా,డీఆర్డీవో రాథోడ్‌రవీందర్‌పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి నినాదాలు చేస్తున్న సాధన సమితి సభ్యులు

వర్సిటీ సాధన బాటలో..

- అవగాహన కల్పిస్తున్న 'సాధన సమితి'
- మేము సైతం అంటున్న విద్యార్థులు, యువత
- ఆందోళనలకు సమాయత్తం
- ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చేలా ప్రణాళిక



మాట్లాడుతున్న సమితి కన్వీనర్ పురుషోత్తంరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: విశ్వవిద్యాలయం ఏర్పాటే లక్ష్యంగా యూనివర్సిటీ సాధన సమితి వడివడిగా అడుగులేస్తోంది. ఓ వైపు మేధావులు, రాజకీయ పార్టీల నాయకులను కలుస్తూ ప్రణాళికలు సిద్ధం చేస్తూనే.. మరోవైపు నిరుద్యోగులు, విద్యార్థులకు వర్సిటీ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. 'మేము మీ వెంట ఉన్నాం.. మీరు మా వెంట రండి.. మీ భవితకు బాటలు వేసుకోండని సూచిస్తున్నారు. సంఘటితంగా పోరాడితే లక్ష్య సాధన సులువేనని అంటున్నారు.

వర్సిటీ ఆవశ్యకతను వివరిస్తూ..

యూనివర్సిటీ ఆవశ్యకతపై సాధన సమితి సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రంథాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఓయూ, కేయూలు దూరంగా ఉండడంతో ఈ ప్రాంత విద్యార్థులు ఏవిధంగా నష్టపోతున్నారు.. అదే ఇక్కడ వర్సిటీ అందుబాటులోకి వస్తే ఒనగూరే ప్రయోజనాలు ఎలా ఉంటాయో వివరిస్తున్నారు. ఒక ప్రాంతం అభివృద్ధి సాధించాలంటే అందులో విద్యారంగం పాత్ర కీలకమని చెబుతున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో కన్వీనర్ బద్దం పురుషోత్తం రెడ్డి, కోకన్వీనర్ గాడిసెల రమణగౌడ్, సలహాదారులు, చిట్యాల సుహాసిని రెడ్డి, సభ్యులు నరేందర్ రెడ్డి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూరజ్ సింగ్, లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ సాధనకు తోడ్పాటునందించాలని కోరారు.

ఉద్యమాలకు ప్రణాళిక సిద్ధం..

వర్సిటీ సాధన సమితి ఉద్యమాలకు సిద్ధమవుతోంది. జిల్లాలోని అన్ని కళాశాలల్లో అవగాహన సదస్సుల అనంతరం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, సభలు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులను కలిసి పోరాటంలో భాగస్వాములు కావాలని, అసెంబ్లీ, పార్లమెంట్‌లో విషయాన్ని ప్రస్తావించాలని విన్నవిస్తామని, సీఎంతో పాటు ఆయా శాఖల మంత్రులను కలుస్తామని సమితి సభ్యులు చెబుతున్నారు. వర్సిటీ సాధించేవరకు నిరంతరంగా ఉద్యమిస్తామని, శాంతియుత పోరాటాలు చేస్తామని పేర్కొంటున్నారు.

మా భవిష్యత్తు ఆలోచించండి..



ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మా భవిష్యత్తు గురించి ఆలోచించాలి. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. పీజీ వంటి ఉన్నత విద్య కోర్సులు స్థానికంగా అందుబాటులో లేక ఈ ప్రాంత విద్యార్థులు డిగ్రీతోనే ఆగిపోతున్నారు. ఆడ పిల్లల్ని తల్లిదండ్రులు దూరప్రాంతాలకు పంపేందుకు వెనుకంజ వేస్తున్నారు. – యు.మనిషా, విద్యార్థిని, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

ఉద్యమంలో పాల్గొంటాం..



పోరాడితేనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. వర్సిటీ కోసం సా ధన సమితి చేస్తున్న పో రాటంలో మేము సైతముందుంటాం. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కూడా భాగస్వాములు కావాలి. ప్రభుత్వ ంపై ఒత్తిడి తేవాలి. వర్సిటీ ఏర్పాటుకోసం సాధన సమితి చేస్తున్న కృషిఅభినందనీయం. – దర్శనాల నందిని, విద్యార్థిని, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

శాంతియుతంగా పోరాటం..

వర్సిటీ ఏర్పాటు కోసం సాధన సమితి ఆధ్వర్యంలో శాంతియుతంగా పోరాటాలు చేస్తాం. విద్యార్థులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను కలుస్తూ వారి సహకారంతో సమష్టిగా ముందుకు సాగుతాం. ఉమ్మడి ఆదిలాబాద్‌లో విశ్వవిద్యాలయం లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రస్తుతం కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. త్వరలో భారీ సభ నిర్వహిస్తాం. అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలి. – బద్దం పురుషోత్తంరెడ్డి, యూనివర్సిటీ సాధన సమితి కన్వీనర్

వినతుల వెల్లువ

- పింఛన్, 'ఇందిరమ్మ' అర్జీలే అధికం
- ప్రజావాణికి 112 దరఖాస్తులు



బాధితుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితులు కలెక్టర్ రాజర్షి షాను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. వారి నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వారం వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 112 అర్జీలు అందాయి. ఇందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల మంజూరుకు సంబంధించినవే ఉన్నాయి. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ సీవీఎస్. రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన..

అధికారుల తీరుపై కలెక్టర్ అసంతృప్తి

ప్రజావాణికి కలెక్టర్ ఉదయం 10.30 గంటలకే హాజరయ్యారు. అర్జీలకు సంబంధించి ఆయా శాఖల అధికారులను పిలువగా అందుబాటులో లేకపోవడంతో వారి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మీ అధికారులెక్కడ అంటూ అక్కడే ఉన్న జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు మనోహర్‌ను ప్రశ్నించారు. వచ్చేవారం నుంచి సకాలంలో హాజరయ్యేలా చూస్తామని ఆయన సమాధానమిచ్చారు. అనంతరం ఆయా శాఖల అధికారులు హుటాహుటిన హాజరయ్యారు. అయితే చాలామంది 11.30గంటల సమయంలో గ్రీవెన్స్‌కు రావడం కనిపించింది.

ఆర్థిక చేయూతనందించండి



నేను నిరుపేద దివ్యాంగుడిని. పాముకాటు కారణంగా కాలు కోల్పోయి 2021లో దివ్యాంగ సర్టిఫికెట్ పొందాను. అప్పటి నుంచి పింఛన్ మంజూరు కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పింఛన్‌తో పాటు ఏదైనా ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటున్నా. – దంగరి శంకర్, బజార్‌హత్నూర్

ఇళ్ల పట్టాలు అందించండి



అయ్యా.. మేము ఇచ్చోడ మండలం అడెగామ పంచాయతీ పరిధిలోని నిరుపేదలం. కూలీనాలి చేసుకుని బతుకుతున్నాం. గూడు లేకపోవడంతో భీమునిగుట్ట ప్రాంతంలో గుడిసెలు వేసుకుని 20 ఏళ్లుగా ఉంటున్నాం. అధికారులు ఇప్పటి వరకు మాకు ఎలాంటి వసతులు కల్పించలేదు. కనీసం పట్టాలు అందించాలని కోరినా పట్టించుకోవడం లేదు. మాపై దయచూపి న్యాయం చేయాలని కోరుతున్నాం. – భీమునిగుట్ట గ్రామస్తులు, ఇచ్చోడ

రోడ్డు ఆక్రమణతో ఇబ్బంది..



పట్టణంలోని నార్తర్న్ వ్యాలీకి వెళ్లే మార్గంలో గల రోడ్డును ఓ వ్యక్తి ఆక్రమించాడు. స్తంభాలు పాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. విచారణ జరిపించి తగు చర్యలు చేపట్టాలి. – అంబికానగర్‌వాసులు, ఆదిలాబాద్

ఆరేళ్లుగా తిరుగుతున్నాం



మాది బోథ్ మండలం కరత్వాడ పంచాయతీలోని జిడిపల్లె. మేమంతా నిరుపేద మహిళలం. భర్తలను కోల్పోయాం. మాకు ఎలాంటి జీవనాధారం లే దు. కూలీనాలి చేసుకుని జీవిస్తున్నాం. ఆరేళ్లుగా వితంతు పింఛన్ మంజూరు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం. – జిడిపల్లె మహిళలు, బోథ్


పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మేమంతా డీఆర్డీఏలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాం. అవి కూడా మూడు నెలలుగా ఇవ్వడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సేవలందిస్తున్న మాకు వేతన పెంపుతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. – కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఆదిలాబాద్

టీచర్ల తీరు మారలే!

- ఫేషియల్ అటెండెన్స్ వచ్చినా అదే పరిస్థితి
- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు



పాఠశాలల వారీగా టీచర్ల అటెండెన్స్ వివరాలు విడుదల చేసిన విద్యాశాఖ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల హాజరుపై ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తున్నా కొంతమంది తీరు మాత్రం మారడం లేదు. ఇదివరకు బయోమెట్రిక్ ఉండగా కొందరు సమయపాలన పాటించారు. మరికొంత మంది వివిధ సాకులతో తప్పించుకున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఇటీవల ఫేషియల్ అటెండెన్స్‌ను అమలులోకి తీసుకొచ్చింది. అయినా పలువురు తమ తీరు మార్చుకోవడం లేదని తెలుస్తోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో డీఈవో పరిధిలో 691 పాఠశాలలు ఉండగా, 3,288మంది ఉపాధ్యాయులు, సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఇంకా 230 మంది టీచర్లు యాప్ డౌన్‌లోడ్ చేసుకోకపోవడం గమనార్హం. మొదటి రోజు 63 శాతం మంది యాప్ ద్వారా హాజరు వేసుకున్నారు. సోమవారం ఉపాధ్యాయుల హాజరును రాష్ట్రవిద్యాశాఖ అధికారులు పరిశీలించారు. ఇందులో పలువురు సమయపాలన పాటించలేదని తెలిసింది. జిల్లాకేంద్రంతో పాటు మారుమూల మండలాల్లో ఉపాధ్యాయులు పాఠశాలకు ఉదయం 9.30 తర్వాత వెళ్లగా, మధ్యాహ్నం 3.30 గంటలకే ఇంటి ముఖం పట్టినట్లు తెలుస్తోంది. మరికొంత మంది 10గంటలు, 11 గంటలకు, 12గంటలు,ఒంటి గంటవరకు వెళ్లగా..మధ్యాహ్నం 3 గంటలు, 3.45 గంటలలోపే యాప్‌లో అటెండెన్స్ నమోదు చేసి ఇంటి ముఖం పట్టారని తెలుస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆ రిపోర్టును పంపించగా అందులో పలువురి సమయపాలన వివరాలు ఇలా నమోదయ్యాయి. తిప్ప పాఠశాలకు చెందిన టీచర్ మధ్యాహ్నం 3.45 గంటలకు, అంకోలి ఉపాధ్యాయుడు ఉదయం 10.12 గంటలకు, రాంపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు 10గంటలకు, చాందాకు చెందిన ఉపాధ్యాయుడు మధ్యాహ్నం 1.31 గంటలకు, యాపల్‌గూడకు చెందిన ఉపాధ్యాయుడు 11.06 గంటలకు, కచ్‌కంటికి చెందిన టీచర్ మధ్యాహ్నం2.53గంటలకు, ఖిల్లాకు చెందిన టీచర్ మధ్యాహ్నం 1.37 గంటలకు, కేజీబీవీ మావలకు చెందిన సీఆర్టీలు ముగ్గురు 11.45, మరొకరు 12 గంటలకు, సరస్వతీనగర్‌కు చెందిన టీచర్ మధ్యాహ్నం1.05గంటలకు ఫేషియల్ అటెండెన్స్‌లో నమోదు చేసుకున్నారు. వీరే కాకుండా మరికొందరు సమయపాలన పాటించలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ట్రయల్‌రన్‌కొనసాగుతుండగా, రెండు మూడు రోజుల తర్వాత ఈ అటెండెన్స్ పకడ్బందీగా అమలు చేయనున్నట్లు రాష్ట్రశాఖ అధికారులు పేర్కొన్నారు. దీనిపై సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇక నుంచి సమయపాలన పాటించని వారికి హైదరాబాద్ నుంచే మెమోలు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అటెండెన్స్ షీట్ విడుదలతో సమయపాలన పాటించని ఉపాధ్యాయుల్లో గుబులు మొదలైంది.

ఆ ఉపాధ్యాయుల వివరాలు పంపండి..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఆయా పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు విధుల్లో చేరడం లేదని సోమవారం ''సర్దుబాటు' ఆదేశాలు బేఖాతరు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సర్దుబాటు ప్రక్రియలో భాగంగా కేటాయించిన కొత్త పాఠశాలలకు చేరని టీచర్ల వివరాలు వెంటనే పంపించాలని ఎంఈవోలు, సంబంధిత ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. వివరాల ఆధారంగా వారిపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

సాక్షి ఎఫెక్ట్..

మహాగర్జనకు తరలిరండి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



'సాక్షి' కథనం చూపుతూ మాట్లాడుతున్న మంద కృష్ణ

ఆదిలాబాద్‌రూరల్: పింఛన్ పెంపు హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాగర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. మహాగర్జన సన్నాహక సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో 'సాక్షి'లో వృద్ధులు, దివ్యాంగుల గురించి కథనాలు రావడంతో చలించి వారి సమస్యలపై పోరాటాలు చేస్తున్నానని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు రూ.6వేలు, వితంతువులు, వృద్ధులకు రూ.4వేల పింఛన్ పెంచి అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా పింఛన్ పెంపు ఊసే లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, మాజీ సీఎం కేసీఆర్‌కు పేదల బాధలు తెలియవని, ఎందుకంటే వారి ఇంట్లో ఎవరు కూడా పేదలు లేరన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆమె భద్రతకు భరోసా

- పోకిరీల చేష్టలకు 'షీటీం'తో చెక్
- పలువురిపై పోక్సో కేసులు
- విద్యాసంస్థల్లో అవగాహన
- వేధింపులా.. డయల్ 8712659953



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: షీటీమ్.. మహిళలపై దాడులు, వేధింపులు, ఆకతాయిల చేష్టలకు చెక్ పెట్టేందుకు ఏర్పాటు చేసిన వ్యవస్థ. ఇది జిల్లాలో పటిష్టంగా పనిచేస్తోంది. గడిచిన ఆరు నెలల్లో నమోదైన కేసులే ఇందుకు నిదర్శనం. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్న పోలీసుశాఖ వారి రక్షణ కోసం షీ టీంలను ఏర్పాటు చేసింది. ఆడవాళ్లపై వేధింపులకు పాల్పడే వారిని ఉపేక్షించకుండా కేసులు నమోదు చేస్తున్నారు. మైనర్లను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న వారిపై పోక్సో కేసులు పెట్టి కటకటాల పాలు చేస్తున్నారు. మరోవైపు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు వెనుకంజ వేస్తున్న వారికి సైతం అండగా నిలుస్తున్నారు. బాధితులకు న్యాయం చేస్తూ వారి వివరాలు గోప్యంగా ఉంటున్నారు.

జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటనలు..

- ఆదిలాబాద్‌లోని ఓ పాఠశాలలో షీటీమ్ సభ్యులు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తుండగా, తనను ఓ వ్యక్తి వేధిస్తున్నాడని బృంద సభ్యులకు సదరు విద్యార్థిని తెలిపింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి వన్‌టౌన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు.
- ఇంద్రవెల్లి మండలంలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడు వేధిస్తున్నాడని విద్యార్థినులు షీటీమ్‌ను ఆశ్రయించారు. దీంతో సదరు టీచర్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.
- ఓ గ్రామం నుంచి యువతి టైలరింగ్ కోసం జిల్లా కేంద్రానికి వస్తుంది. ఈ క్రమంలో ఆమెను వేధిస్తున్న యువకుడిని షీటీమ్ మారువేషంలో వెళ్లి పట్టుకుని అరెస్టు చేశారు.
- ఓ బస్టాండ్‌లోని వాష్‌రూమ్‌లో ఓ మహిళకు సంబంధించిన ఫోన్ నంబర్‌ను ఓ వ్యక్తి రాశాడు. దీంతో ముగ్గురు ఆ మహిళకు ఫోన్ చేసి వేధింపులకు పాల్పడ్డారు. సదరు మహిళ షీటీంను ఆశ్రయించింది. ముగ్గురిని అరెస్టు చేయడంతో పాటు అక్కడి నుంచి ఫోన్ నంబర్ తొలగించారు.
- గుడిహత్నూర్‌లో ఓ బాలిక ఫొటోలు తీసి నిందితుడు వేధింపుకు పాల్పడ్డాడు. స్నేహితులకు వాటిని షేర్ చేశాడు. దీంతో పోలీసులు తొమ్మిది మందిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.
- ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ వివాహితను ఏడేళ్లుగా ఓ వ్యక్తి వేధింపులకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితురాలు షీటీంను సంప్రదించగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు.

విస్తృత స్థాయిలో అవగాహన..

మహిళలు, యువతులు, విద్యార్థినులపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, సోషల్ మీడియా తదితర విషయాలపై షీటీమ్ సభ్యులు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్, దుకాణ సముదాయాలు, గ్రామాలకు వెళ్లి కూలీలకు సైతం అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఒక షీటీమ్ పనిచేస్తుంది. ఇందులో ఏఎస్సై బి.సుశీల,హెడ్‌కానిస్టేబుల్ వాణిశ్రీతో పాటు ఇద్దరు ఏఆర్ మహిళా పోలీసులున్నారు. వీరికోసం ప్రత్యేక వాహనం కేటాయించారు. వీరు జిల్లాలో ఎక్కడ సంఘటన జరిగినాచేరుకొని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు.

జిల్లాలో కేసుల వివరాలు..

ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 18 కౌన్సెలింగ్‌లు, 51 పెట్టి కేసులు, 16 ఎఫ్ఐఆర్, 84 అవగాహన సదస్సులు నిర్వహించారు. 254 గ్రామాల్లో షీటీమ్ సభ్యులు పర్యటించారు. నాలుగు బాల్య వివాహాలను అడ్డుకున్నారు. గడిచిన నాలుగు నెలల్లో నాలుగు పోక్సో కేసులు నమోదు చేశారు.

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు..

మహిళలు, యువతులు, విద్యార్థినులను పోకిరీలు వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బాధితులు షీటీమ్ సెల్:8712659953 నంబర్‌పై సంప్రదించాలి. స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. వివరాలు గోప్యంగా ఉంచుతాం. షీటీమ్ ద్వారా జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – అఖిల్ మహాజన్, ఎస్పీ

క్లుప్తంగా

ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎనిమిదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎనిమిదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.11వేల జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. 2021లో బాధితుడు నవీద్ అహ్మద్ రైతుబజార్ నుంచి కూరగాయలు తీసుకొని రాంనగర్‌లో గల తన ఇంటివైపు వెళ్తుండగా రణదీవెనగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సురేతార్ సంతోష్ కలెక్టరేట్ చౌరస్తా వద్ద వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో నవీద్ అహ్మద్ మృతి చెందాడు. బాధితుడి తండ్రి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ షాహిన్ సుల్తాన నేరం రుజువు చేయడంతో జడ్జి తీర్పు వెలువరించారు. వాహన యజమాని బమ్మకంటి శివమణికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు వివరించారు. నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసిన వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

ఒకరికి ఏడాది..

భీమిని: మహిళను వివస్త్రను చేయడమే కాకుండా దుర్భాషలాడినందుకు ఒకరికి ఏడాది జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ బెల్లంపల్లి కోర్టు న్యాయమూర్తి జే.ముఖేష్ సోమవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. 2017లో భీమిని మండలంలోని వీగాం గ్రామానికి చెందిన గాండ్ల అంకమ్మ అదే గ్రామానికి చెందిన ఓ మహిళను వివస్త్రను చేసి, బూతులు తిట్టడంతో బాధిత మహిళ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శేఖర్ కేసు నమోదు చెశారు. కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాతకక్షలతో ఒకరిపై దాడి


చికిత్స పొందుతున్న చిన్నయ్య

లక్ష్మణచాంద: పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని ఒకరిపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని రాచాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గైనం చిన్నయ్య కొన్నేళ్ల క్రితం లక్ష్మణచాందకు ఇల్లరికం వెళ్లాడు. మూణ్నెళ్ల క్రితం తన తల్లి అనారోగ్యానికి గురికావడంతో రాచాపూర్‌కు వెళ్లి అక్కడే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద భజనకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన భూషి రాకేష్ పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని చిన్నయ్యను దుర్భాషలాడడమే కాకుండా అతనిపై కర్రతో దాడి చేశాడు. తీవ్రగాయాలు కావడంతో నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి కుమారుడు ముత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.


చోరీ కేసులో నిందితుడు రిమాండ్

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ఏకనాథ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీకి పాల్పడిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రవీందర్ సింగ్ తెలిపారు. గుండంపల్లికి చెందిన తోట ప్రవీణ్ ఆదివారం రాత్రి ఆలయ ముఖద్వారానికి ఉన్న తాళం పగులగొట్టి హుండీలో ఉన్న నగదును అపహరించాడు. సోమవారం తెల్లవారు జామున వచ్చిన భక్తులు గమనించి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఆత్మహత్యాయత్నం

సారంగపూర్: సెల్‌ఫోన్ కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన క్లెం సాయన్న–లక్ష్మి దంపతులకు నలుగురు కుమారులు సంతానం. కొంతకాలం క్రితం సాయన్న మృతి చెందగా కుటుంబ బాధ్యతలు తల్లి లక్ష్మి చూసుకుంటోంది. ఈక్రమంలో మూడవ కుమారుడు అయిన శంకర్ కొద్దిరోజులుగా తనకు సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లిని వేధిస్తున్నాడు. వద్దని వారించడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం గ్రామ సమీపంలోని ఓచెట్టుకు ఉరేసుకునేందుకు ప్రయత్నించాడు. అటుగా వెళ్లిన వ్యక్తి గమనించి తాడును కోసేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఎలాంటి ప్రాణాపాయం లేదని స్థానికులు తెలిపారు.

చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి


చోరీకి యత్నించిన వ్యక్తి

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామ శివారులో ఉన్న మల్లన్న ఆలయంలో సోమవారం చోరీకి యత్నిస్తున్న వ్యక్తిని అటుగా వెళ్తున్న పలువురు గమనించి దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందించడంతో నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు అడిగితే నోరు విప్పడం లేదని, పేరు చెప్పడం లేదని, నిజాంసాగర్‌కు చెందిన వ్యక్తిగా తెలిసిందని పలువురు పేర్కొన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత

- ఆస్పత్రిలో చికిత్స అందించిన సిబ్బంది
- నిలకడగా బాలికల ఆరోగ్యం
- పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో శంకరమ్మ


విచారణ చేపడుతున్న ఎంపీడీవో శంకరమ్మ

రెబ్బెన(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాష్ట్రంలోని పలు గురుకులాల్లో ఇటీవల ఫుడ్ పాయిజన్ సంఘటనలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. రెబ్బెనలోని గురుకుల బాలికల పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో బాలికలు పగలంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. రాత్రి భోజనం ముగించుకుని పడుకోగా.. పదో తరగతి చదువుతున్న స్పందన, సంకీర్తన, సంజన ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సిబ్బంది మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి స్పందన, సంజనను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సంకీర్తన ఆరోగ్యం కుదుటపడడంతో బెల్లంపల్లి నుంచి ఇంటికి పంపించారు. మళ్లీ సోమవారం ఉదయం మరో విద్యార్థిని అక్షర సైతం అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమెను రెబ్బెన పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం బెల్లంపల్లికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎంపీడీవో శంకరమ్మ సోమవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలతో పాటు పరిసరాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.


చికిత్స పొందుతున్న స్పందన


సంజనకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

ఆరోగ్య సమస్యలతోనే అస్వస్థత

బాలికల గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రజిని తెలిపారు. ఆదివారం విద్యార్థులంతా ఆనందంగా ఉన్నారని, రాత్రి భోజనాలు చేసి పడుకున్న తర్వాత ముగ్గురు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. సోమవారం ఉదయం మరో విద్యార్థిని అస్వస్థతకు గురికాగా ఆస్పత్రికి తరలించామన్నారు. బాలికలు గైనక్ సమస్యతో పాటు ఆస్తమా, ఆయాసం వంటి కారణాలతో అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ఇదే విషయంపై రెబ్బెన పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్‌ను వివరణ కోరగా.. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగిందని ఇప్పుడే చెప్పలేమని అన్నారు. స్కానింగ్, ట్యూబ్ కల్చర్ పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. కడుపునొప్పి, ఆయాసంతో పీహెచ్‌సీకి రాగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తరలించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ‘గురుకులం’ విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 2న శనివారం మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జావెలిన్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ముల్కల్ల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఏ.ఉల్లాస్ జావెలిన్‌త్రోలో బంగారు పతకం, బి.కార్తీక్ పరుగు పందెంలో రజత పతకం, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో కాంస్య పతకం, రిత్విక్ 60 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో రజత పతకం సాధించారు. ఈ నెల 7న జనగామ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పాల్గొననున్నారు. సోమవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారయ్య, ప్రిన్సిపాల్ కుమ్మరి మోహన్, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమేష్, పీడీ శ్రీకాంత్, పీఈటీ సాగర్, ఉపాధ్యాయులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాళ్లు

పట్టపగలే రూ.5 లక్షలు చోరీ


బాధితుడు ఆనంద్‌గౌడ్


సీసీ కెమెరాలో నమోదైన చోరీ దృశ్యం

భైంసాటౌన్: పట్టపగలే ఓ దుండగుడు స్కూటీ డిక్కీ తెరిచి రూ.5 లక్షలు అపహరించిన ఘటన భైంసా పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. ముధోల్ మండలం ఎడ్‌బిడ్‌కు చెందిన బి.ఆనంద్‌గౌడ్ కూతురు అమెరికాలో ఉంటోంది. ఈ క్రమంలో తండ్రిని అమెరికాకు రప్పించుకునేందుకుగానూ ఆమె తన తండ్రి ఖాతాకు డబ్బు పంపింది. వాటిని డ్రా చేసేందుకు సోమవారం పట్టణంలోని యూనియన్ బ్యాంకుకు వచ్చాడు. బ్యాంక్ నుంచి రూ.5లక్షలు విత్‌డ్రా చేసి స్కూటీ డిక్కీలో పెట్టాడు. కుభీర్ చౌరస్తాలోని సాయిలక్ష్మి బార్‌లో భోజనం చేసేందుకు స్కూటీని బయట నిలిపి లోనికి వెళ్లాడు. ఇదంతా గమనిస్తూ అతన్ని అనుసరించిన దుండగుడు స్కూటీ డిక్కీ తెరిచి నగదును అపహరించుకుపోయాడు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. బాధితుడు బయటకు వచ్చి చూసేసరికి డిక్కీ తెరిచి ఉండడం, నగదు లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ జి.గోపినాథ్ తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఆగంతకుల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

కోర్టు ఆదేశాలు బేఖాతరు..

- వారం రోజులు కావస్తున్నా ప్రారంభంకాని ప్రక్రియ
- ఓరియంట్ ఎన్నికల ఊసేఎత్తని కార్మికశాఖ

కాసిపేట: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ఓరియంట్ సిమెంట్ కంపెనీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు బేఖాతరయ్యాయి. 15 రోజుల్లో ఎన్నికలు నిర్వహించి 20 రోజుల్లో పూర్తి నివేదికను కోర్టుకు సమర్పించాలని జూలై 28న హైకోర్టు కార్మికశాఖను ఆదేశించింది. వారం రోజులు కావస్తున్నా ఎన్నికల ప్రక్రియ ప్రారంభించక పోవడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం నిర్వహించాల్సిన ఎన్నికలు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో వాయిదా వేస్తూ వస్తున్నారు. దీనిపై కార్మికసంఘం నాయకులు హైకోర్టును ఆశ్రయించగా ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. అయినప్పటికీ డీసీఎల్ దీర్ఘకాలిక సెలవులో ఉందన్న సాకుతో కార్మికశాఖ సాగతీస్తుండగా ఆ శాఖ కమిషనర్ స్పందించక పోవడం, డీసీఎల్ స్థానంలో తాత్కాలికంగా ఇతరులను నియమించక పోవడంపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్మికశాఖ రాజకీయ ఒత్తిళ్లు వీడి ఎన్నికల నిర్వహణకు ముందుకు వస్తుందా? లేక కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

కార్మికులకు జరిగిన అన్యాయాలు సవరించాలి

జైపూర్: జూలై 30, 31వ తేదీల్లో జరిగిన కార్పొరేట్ మెడికల్ బోర్డులో కార్మికులకు జరిగిన అన్యాయాలను వెంటనే సవరించాలని సంస్థ యాజమాన్యాన్ని కోరామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. సోమవారం జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 52 మంది కార్మికుల్లో కేవలం నలుగురిని మాత్రమే మెడికల్ ఇన్‌వాల్యుడేట్ చేయడం, చాలా మందిని ఫిట్ ఫర్ సేమ్ జాబ్ అని చెప్పడం, కొంతమందిని అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ చేసి సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా ఇచ్చారన్నారు. ఇందులో ఆశ్చర్యకరంగా సర్ఫేస్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్లను మెడికల్ అన్‌ఫిట్ చేసి సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్‌గా ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి శ్రీనివాస్, పిట్ కార్యదర్శులు నవీన్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ఉట్నూర్‌రూరల్: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ సొంతపిల్లల్లా భావించి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ అలుగు వర్షిని సంబంధిత హెచ్‌ఎంలకు సూచించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫుడ్ కమిటీ సభ్యులుగా పిల్లలను నియమించాలని, నెలకోసారి కమిటీలో మార్పులు చేయాలని సూచించారు. రాత్రిపూట మిగిలిన ఆహారాన్ని ఎప్పటికప్పుడు బయట పడేయాలన్నారు. హెచ్‌ఎం, వార్డెన్లు సెలవు పెడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే కలెక్టర్, ఐటీడీఏ పీవో, సంబంధిత ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, డీటీడీవోలు, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీలను ఈ నెల 14 నాటికి పూర్తిస్థాయిలో భర్తీ చేయాలన్నారు.

ప్రహరీ కూలి వలస కూలీ మృతి

మంచిర్యాలక్రైం: ప్రమాదవశాత్తు ప్రహరీ గోడ కూలి వలస కూలీ మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలంలోని పోతపల్లి గ్రామానికి చెందిన డోకే లచ్చయ్య (32) సోమవారం మరో ఆరుగురితో కలిసి ప్రహరీగోడ మరమ్మతు పనులు చేసేందుకు వెళ్లాడు. పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి లచ్చయ్య మీద పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై స్థానిక ఎస్సై తిరుపతిని వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు రాలేదన్నారు.

న్యాక్ ఏడీ నాగేంద్రం బదిలీ


ఏడీలను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్) ఏడీగా పనిచేస్తున్న నాగేంద్రం హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బెల్లంపల్లికి చెందిన స్వప్నరాణిని ఏడీగా నియమించారు. సోమవారం బదిలీపై వెళ్తున్న ఏడీని, బాధ్యతలు చేపట్టిన నూతన ఏడీలను కార్యాలయ ఉద్యోగులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ సిబ్బంది రమేష్, దీపక్, మహేష్, తిరుపతి, మేరి విక్టోరియా, తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై సీఐడీకి ఫిర్యాదు

నిర్మల్‌టౌన్: బీసీసీఐ నుంచి క్రికెట్ అభివృద్ధి కోసం విడుదలయ్యే నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా కోచ్ రామరాజు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌లోని వివిధ జిల్లాల కార్యదర్శులతో కలిసి సోమవారం హైదరాబాద్‌లో సీఐడీకి ఫిర్యాదు చేశారు. పదేళ్లుగా హెచ్‌సీఏ జిల్లాల పేరుతో ఖాతాల్లో నమోదు చేసిన సుమారు రూ.12 కోట్లు దుర్వినియోగం చేసినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఇందుకు హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లు, జిల్లా కార్యదర్శులు చేకూరి వెంకట్ (ఖమ్మం), చాగంటి శ్రీనివాస్(వరంగల్), కోదాటి ప్రదీప్ (ఆదిలాబాద్), ఎం.రాజశేఖర్(మహబూబ్ నగర్), ఏ.రాజేందర్‌రెడ్డి (మెదక్), వెంకట్‌రెడ్డి(నిజామాబాద్), ఆగం రావు (కరీంనగర్), సయ్యద్ అమీనుద్దీన్ (నల్గొండ) ఉన్నారని వివరించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నిధులు రికవరీ చేయాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన ఎస్.చరణ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన ఎస్.చరణ్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై నట్లు కోచ్ రమేశ్ తెలిపారు. హన్మకొండలో ఈనెల 3, 4 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ట్రయాథ్లాన్–ఏ ఈవెంట్లో స్వర్ణ పతకం సాధించాడు. సెప్టెంబర్ 9 నుంచి 11వరకు పాండిచ్చేరిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాడని వెల్లడించారు. అదే విధంగా హన్మకొండ వేదికగా జరిగిన 11వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సోమవారం క్రీడ పాఠశాలకు చెందిన విద్యార్థి శివాని 600 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్ అభినందించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీల భర్తీ

మందమర్రిరూరల్: సీసీసీ (నస్పూర్)లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గానూ సింగరేణి కోటాలో వివిధ కోర్సుల్లో ఇంకా మిగిలి ఉన్న 66 సీట్లను భర్తీ చేయనున్నట్లు యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సివిల్ కోర్సులో 27, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో 06, మెకానికల్‌లో 23, మైనింగ్‌లో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేసిన తర్వాత ప్రభుత్వ కన్వీనర్ కోటాలో మిగిలి ఉన్న సీట్లకు ఈ నెల 7న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9010222161 నంబర్‌లో సంప్రదించాలని సూచించింది.

టైగర్‌జోన్‌లో భారీ వాహనాలకు త్వరలోనే అనుమతి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


మంత్రులు సీతక్క, సురేఖతో ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో భారీ వాహనాల రాకపోకలకు త్వరలోనే అనుమతులు వస్తాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర అటవీ శాఖ వైల్డ్ లైఫ్ బోర్డ్ సమావేశంలో పలు విషయాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రం విలేకరులతో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకకు సహకరించాలని, అటవీ హక్కు చట్టం ప్రకారం అడవిలో ఉండే ఆదివాసీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీలు, ఇతర రైతులను ఇబ్బంది పెట్టవద్దని, పోడు భూముల్లో సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు సహకరించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని, బఫర్‌జోన్‌ను రద్దు చేయాలని అటవీశాఖ అధికారులకు సూచించినట్లు తెలిపారు. తాత్కాలికంగా రోడ్లు, వంతెనలకు సహకరించాలని, ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఒంటిద్దు పోకడలకు పోతే ఓపిక నశించి ప్రజలు తిరుగుబాటు చేస్తారని, ఈ విషయంపై ఆలోచించాలని, పై విషయాలపై వైల్డ్‌లైఫ్ బోర్డ్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. త్వరలోనే భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఎత్తివేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆర్జీయూకేటీలో యక్షగాన కళా ప్రదర్శన


ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

బాసర: బాసరలోని ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో సోమవారం స్పిక్ మాకే హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో యక్షగాన కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు యువతలో సాంస్కృతిక అవగాహన పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ‘స్పిక్ మాకే’ సంస్థ తెలంగాణ 4వ రాష్ట్ర కన్వెన్షన్‌ను ఈ ఏడాది బాసర క్యాంపస్‌లో నిర్వహించడం గర్వకారణమన్నారు. కర్ణాటక నుంచి వచ్చిన కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాకారుడు శ్రీ కేరమనే శివానంద హెగ్డే మాట్లాడుతూ ఇంత గొప్ప వేదికపై ప్రదర్శించటం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా రామాయణంలోని ‘సీతాపహరణం’ ఘట్టాన్ని ఆధారంగా తీసుకుని, రావణుని అధర్మపు చర్యలు, సీతమ్మ త్యాగం, రామలక్ష్మణుల బాధలను అత్యంత హృద్యంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య మురళీదర్శన్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్యను హత్యచేసిన భర్త అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీఐ వేణుచందర్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుచందర్

జైపూర్: మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వడం లేదని భార్యను అతి కిరాతకంగా హత్యచేసిన భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణుచందర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని నర్వ గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి గోదారి రాజయ్య మద్యానికి బానిసయ్యాడు. వచ్చిన పెన్షన్ డబ్బులు తాగుడుకు సరిపోకపోవడంతో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న అతని భార్య రాజమణిని తరచూ డబ్బులు ఇవ్వాలని వేధించేవాడు. ఈ విషయంలో ఇద్దరికి తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 2న ఇద్దరి మధ్య జరిగిన గొడవలో కర్రపై రాజమణి తలపై కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక ఎస్సై శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్


మాట్లాడుతున్న ఏఎస్పీ కాజల్ సింగ్

ఉట్నూర్‌రూరల్: ప్రజలు ఇతరులను గుడ్డిగా నమ్మి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని మల్టీ లెవెల్ మార్కెటింగ్‌లో డ్రీమ్ డాలర్ లైఫ్ పేరుతో టోకెన్ ప్యాకెట్ అనే అప్లికేషన్ నందు ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌ను జిల్లా పోలీసులు గుర్తించారన్నారు. ఇందులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. సోమవారం కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని వణికి చెందిన రితేష్ వాతేకర్ ద్వారా ఉట్నూర్ మండలంలోని షాంపూర్‌కు చెందిన చౌకటే సంగ్రామ్, మెండె నారాయణ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌లోని అప్లికేషన్ నందు రూ.1500 కట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఇరువురు దాదాపు 11 మందిని చేర్పించగా ఒక్కొక్కరి నుంచి రూ.500 చొప్పున వారికి వెళ్లినట్లు విచారణలో తెలిసిందన్నారు. ప్రజలు మల్టీ లెవెల్ మార్కెటింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రెండు ఎడ్లు, ఆవు అపహరణ


వివరాలు సేకరిస్తున్న ఎస్సై బిట్ల పెర్సిస్

తానూరు(ముధోల్): ముధోల్ మండల కేంద్రంలోని ముక్త దేవి కాలనీలో ఆదివారం రాత్రి హంగిర్గ భోజన్నకు చెందిన రెండు ఎడ్లు, ఒక ఆవును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. భోజన్న తన రెండు ఎడ్లు, ఒక ఆవును సాయంత్రం రోడ్డు పక్కన ఉన్న నీటి ట్యాంకు కింద కట్టేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వాటిని దొంగిలించారు. గమనించిన బాధితుడు భోజన్న సోమవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై బిట్ల పెర్సిస్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించాడు. పశువుల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కరత్వాడ ప్రాజెక్టు కుడికాలువకు లీకేజీ

- వృథాగా పోతున్న నీళ్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు


వృథాగా పోతున్న నీళ్లు

బోథ్: మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు కుడి కాలువకు లీకేజీ ఏర్పడి కొంతకాలంగా నీరు వృథాగా పోతోంది. వర్షాకాలంలో ప్రాజెక్టులో నీటిని ఆపాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాలు లేక ప్రాజెక్టు లోకి నీరు రావడం లేదని, నీరు వృథాగా పోతుండడంతో ప్రాజెక్టు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని, రబీ సీజన్‌లో నీటికొరత ఏర్పడే అవకాశం ఉందని వాపోతున్నారు. విషయాన్ని బోథ్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి రాజు అనే యువ రైతు, పలువురు రైతులతో కలిసి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలు సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టులు చేశారు. దీంతో అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికారులు కుడి కాలువ ద్వారా వెళ్తున్న నీటిని ఆపివేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగల బెడద


బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగల చేతివాటంతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని ఎర్వచింతల్ గ్రామానికి చెందిన కొడారి మంజుల, ఎడ్ల వనిత సోమవారం స్వగ్రామాలకు వెళ్లేందుకు ఖానాపూర్ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు ఎక్కే క్రమంలో రద్దీ ఎక్కువగా ఉండడంతో ఇదే అదనుగా భావించిన దొంగలు మంజుల పర్సులో ఉన్న రూ.11,300, వనిత పర్సులో ఉన్న రూ.500 నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో విచారణ చేపట్టారు. పర్సులో నగదుతో పాటు ఏటీఎం కార్డు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫొటోలను చోరీ చేశారని బాధితులు పేర్కొన్నారు.